సాక్షి విశాఖపట్నం

శనివారం । 13 । జనవరి । 2024



అప్పన్న సన్నిధిలో అమర్

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం రాష్ట్ర ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సతీసమేతంగా దర్శించుకున్నారు.



అటల్ సేతు నిర్మాణంలో..

కేంద్రం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అటల్ సేతు బ్రిడ్జి నిర్మాణంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను వినియోగించారు.

IIలో

నలుగురికి కరోనా



మహారాణిపేట: విశాఖలో శుక్రవారం మరో నలుగురికి కరోనా సోకింది. 24 గంటల్లో 42 మందికి పరీక్షలు చేయగా, వీరిలో నలుగురికి కరోనా నిర్ధారణ జరిగింది. ఎనిమిది మంది హోమ్ ఐసోలేషన్‌లో, ముగ్గురు ఆస్పత్రుల్లో, 62 డిశ్చార్జ్ అయ్యారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

పండగొచ్చింది



మహిళకు పట్టా అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, చిత్రంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే నాగిరెడ్డి, కలెక్టర్ మల్లికార్జున, పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు, మాజీ ఎమ్మెల్యేలు గురుమూర్తి రెడ్డి, చింతలపూడి తదితరులు

- స్టీల్‌ప్లాంట్, ఫార్మా నిర్వాసితుల కుటుంబాల్లో వేడుక
- పేదల కొత్తింటి కల నెరవేరడంతో సంక్రాంతి కళ
- 240 టిడ్కో ఇళ్లల్లో నిరుపేదల గృహ ప్రవేశాలు

సాక్షి, విశాఖపట్నం : సాధారణంగా భోగి పండగ తర్వాత సంక్రాంతి వస్తుంది. కానీ మహా నగరంలో ఈసారి మాత్రం భోగి పండగకు ముందే సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. దశాబ్దాల పోరాటం ఫలించిన కుటుంబాలకు.. సొంతింటి కల సాకారమైన నిరుపేదలకు ఈ పండగ.. కలకాలం గుర్తుండిపోయే చారిత్రక నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 7,026 మందికి కన్వేయన్స్ డీడ్స్ అందించడంతో పాటు.. 39 ఉక్కు కర్మాగార నిర్వాసిత కుటుంబాలు, 40 ఫార్మాసిటీ భూనిర్వాసిత కుటుంబాలకు కన్వేయన్స్ పట్టాలు అందించారు. ఏకంగా రూ.1500 కోట్ల విలువైన ఆస్తిని సంక్రాంతి కానుకగా ప్రభుత్వం అందించి సమస్యను శాశ్వతంగా ప్రభుత్వం పరిష్కరించడంతో.. గాజువాక హౌసింగ్ సొసైటీలో సంబరాలు మిన్నంటాయి. ఈ జన్మకైనా సొంతింటి కల నెరవేరదనే నిరాశలో ఉన్న పేదలకు ఈ సంక్రాంతికి సొంత చిరునామాను రాష్ట్ర ప్రభుత్వం కల్పించి.. వారి ఆశలను నెరవేర్చింది. మధురవాడలో రూ.18.90 కోట్లతో 240 మంది పేదలు సంబరంగా టిడ్కో ఇళ్లల్లో సామూహిక గృహ ప్రవేశాలతో పండగ చేసుకున్నారు. రాష్ట్రంలోనే ఎక్కువగా అడ్మిషన్లు జరిగే చంద్రంపాలెం పాఠశాలకు వెళ్లాలంటే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ జాతీయ రహదారి దాటుతున్నారు. ఈ అంశంపై గత ప్రభుత్వం హామీ ఇచ్చినా.. దాన్ని బుట్టదాఖలు చేసింది. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ధైర్యంగా చదువుకునేందుకు పాఠశాలకు వెళ్లాలన్న ఉద్దేశంతో రూ.2.50 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఈ వంతెన రాబోతుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల కళ్లల్లో సంక్రాంతి శోభ కనిపిస్తోంది.



చంద్రంపాలెంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు గురువులు



మాధవధారలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న వైవీ సుబ్బారెడ్డి, కోలా గురువులు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తదితరులు




మధురవాడ సుద్ద గెడ్డలో లబ్ధిదారులతో కలిసి టిడ్కో ఇళ్లను ప్రారంభిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

బండారు బెండు వంచారు

- జనసేన పొత్తుతో పెందుర్తి టికెట్ కట్
- మాడుగులకు వెళ్లాలంటూ అధినేత ఆదేశం
- పెందుర్తి కావాలంటూ బండారు పట్టు
- కష్టమేనంటున్న సొంత పార్టీ నేతలు
- రోజాపై వ్యాఖ్యల తర్వాత మరింతగా దిగజారిన పరిస్థితి
- బండారు రాజకీయ చాప్టర్ క్లోజ్ అంటున్న సన్నిహితులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

సీటు కోసం నోటికి పని చెప్పి... వయస్సును కూడా మరచిన బండారు బెండు వంచింది సొంత పార్టీ. రానున్న ఎన్నికల్లో పెందుర్తి నుంచి టికెట్ లేదంటూ ఆ పార్టీ అధినేత బండారుకు తేల్చి చెప్పినట్టు సమాచారం. జనసేనతో పొత్తు నేపథ్యంలో ఈ సీటును ఆ పార్టీకి కేటాయించనున్నట్టు పార్టీ పెద్దలు స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. ఒకవేళ ఎన్నికల రాజకీయంలో ఉండాలంటే మాడుగుల నియోజకవర్గం నుంచి అదృష్టాన్ని పరీక్షించుకోవాలని తేల్చిచెప్పినట్టు ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, మాడుగుల నుంచి బరిలోకి దిగేందుకు బండారు ససేమిరా అంటున్నారు. పెందుర్తి టికెట్ కావాలంటూ అధిష్టానం వద్ద మార్కులు కొట్టేసేందుకు వయస్సును కూడా మరచి మంత్రి రోజాపై అవాకులు చెవాకులు పేలారు. అయినప్పటికీ బండారుకు గ్రీన్‌సిగ్నల్ లభించలేదు. పైగా ఆయన వ్యాఖ్యలతో మరింతగా పరిస్థితి దిగజారిపోయిందంటూ సొంత పార్టీ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటే ఇక బండారు సత్యనారాయణమూర్తి రాజకీయ చాప్టర్ ముగిసిన అధ్యాయమేనని ఆయన వర్గీయులే వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా సీటు కోసం నోటికి పనిచెప్పి ఉన్న కొద్దిపాటి గౌరవాన్ని దిగజార్చుకున్నా ఫలితం లేకపోవడంతో తన సన్నిహితుల వద్ద పార్టీ అధినాయకత్వంపై మండిపడుతున్నట్టు తెలుస్తోంది. మంత్రి రోజాపై వ్యాఖ్యల తర్వాత బండారు రాజకీయ గ్రాఫ్ మరింత వేగంగా దిగజారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



టీడీపీ సీట్ల చిత్రాలు

పెందుర్తి సీటుపై జనసేన కన్ను

గతంలో ప్రజారాజ్యం పార్టీ తరఫున పెందుర్తి నియోజకవర్గం నుంచి గెలవడంతో ఈ సీటు కోసం జనసేన పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఈ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానంటూ పంచకర్ల రమేష్‌బాబు పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. అధికారికంగా పార్టీ ప్రకటించనప్పటికీ ఈ సీటు తనదేనని ఆయన చెప్పుకుంటున్నారు. అయితే, సీటు జనసేనకు కేటాయించినా తెలుగుదేశం పార్టీ వర్గాలు సహకరించేది కష్టమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికీ సీట్ల వ్యవహారం కొలిక్కిరాకపోవడంతో తెలుగుదేశం-జనసేన కలిసి జెండాలు పట్టుకుని రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. ఇక్కడ మాత్రం ఎక్కడా కలిసి కార్యక్రమాలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవేళ అధికారికంగా బండారుకు ఝలక్ ఇస్తే.. జనసేన అభ్యర్థికి సహకరించడం కష్టమేనని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే ఇరు పార్టీల పొత్తుకు ఇక్కడి నుంచే బీటలు పడటం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

వాస్తవానికి గతంలో పెందుర్తి నియోజకవర్గం నుంచి గెలిచి మంత్రిగా కూడా బండారు పనిచేశారు. గత ఎన్నికల్లో యువకుడైన అదీప్‌రాజ్ చేతిలో మట్టికరిచారు. అప్పటి నుంచి ఎలాగోలా వార్తల్లో ఉండేలా బండారు నోటికి పనిచెబుతూ వస్తున్నారు. ప్రభుత్వంపై ఏదో ఒక ఆరోపణ చేస్తూ వార్తల్లో నిలిచే విధంగా చూసుకున్నారు. అయితే, ప్రజల్లో మద్దతు కోల్పోవడంతో ఆయనకు సీటు ఇచ్చినా గెలిచే అవకాశం లేదని తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గంలో చేసినా అరాచకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వచ్చాయి. ఆయన కుమారుడు వ్యవహరించిన తీరు ప్రజల్లో వ్యతిరేకతను మరింతగా పెంచింది. ఆయన అధికారంలో ఉన్న సమయంలో నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టలేదు. కేవలం భూకబ్జాలకే పరిమితమయ్యారన్న విమర్శలు వినిపించాయి. ఈ నేపథ్యంలోనే పెందుర్తి నియోజకవర్గాన్ని తమకు కేటాయించాలంటూ జనసేన పార్టీ పట్టుబట్టింది. అయితే, పెందుర్తి నుంచి టికెట్ ఇవ్వకపోతే తన సత్తా చూపిస్తానంటూ బండారు సన్నిహితుల వద్ద తేల్చిచెబుతున్నట్టు తెలుస్తోంది. వయసైపోయిన నేపథ్యంలో తనకు రాజకీయ భవిష్యత్ లేకుండా పోతుండటం.. ఇప్పటికీ వారసత్వంగా కొడుకును పరిచయం చేయకపోవడం బండారును చాలా బాధ పెడుతున్నట్టు తెలుస్తోంది.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం నగర మేయర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో 38 అంశాలతో పాటు 17 టేబుల్ అజెండా అంశాలు పొందుపరచగా, వాటిని చర్చించి అన్ని అంశాలను ఆమోదించినట్టు చైర్‌పర్సన్ తెలిపారు.

ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి రూ.4.32 కోట్ల అభివృద్ధి పనులు, ప్రజారోగ్యానికి సంబంధించి పలు కార్యక్రమాలు, అదనపు కార్మికులను తాత్కాలికంగా సేవలు వినియోగించుకునేందుకు ఇతర కార్యక్రమాలకు సుమారు రూ.1.37 కోట్లు, రెవెన్యూ విభాగానికి సంబంధించిన లీజులు పొడిగింపు తదితర అంశాలను సభ్యులు చర్చించి ఆమోదించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో జాతీయస్థాయిలో విశాఖకు 4వ ర్యాంకు వచ్చినందుకు సహకరించిన విశాఖ నగర ప్రజలు, డిప్యూటీ మేయర్లు, స్థాయీ సంఘ సభ్యులు, ఫ్లోర్ లీడర్లు, కార్పొరేటర్లు, పారిశుధ్య కార్మికులు, జీవీఎంసీ అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛభారత్ అంబాసిడర్లు, సినీ, క్రీడా ప్రముఖులకు మేయర్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో స్థాయీ సంఘ సభ్యులతో పాటు కార్యదర్శి పి.నల్లనయ్య, డీసీ(రెవెన్యూ) ఫణిరామ్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, జోన్-5 కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణా, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆదినారాయణ, కార్యనిర్వాహక ఇంజనీర్లు సంతోషికుమారి, తారా ప్రసన్న, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్, స్థాయి సంఘ చైర్‌పర్సన్ హరి వెంకటకుమారి

న్యాయ సహాయకులకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ లీగల్ : విశాఖలోని జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థలో సమాంతర న్యాయ సేవ సహాయకులుగా సేవలందించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ శుక్రవారం పేర్కొన్నారు. కనీసం పదో తరగతి చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. వివిధ సేవా సంస్థల్లో పని చేసే వారికి ప్రాధాన్యత ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులు మండల పరిధిలోని వివిధ సంస్థల్లో సేవలు అందించవలసి ఉంటుంది. వీరు ఏడాది పాటు తన సేవలో అందించాలి. ఎంపికైన వారికి ఎటువంటి పారితోషికం ఉండదు. ఔత్సాహికులైన వారు తమ బయోడేటా, ఆధార్ కార్డు, ఏదో సేవా సంస్థల్లో పనిచేసే వారి ధ్రువీకరణ సమర్పించాలి. అభ్యర్థులు తమ దరఖాస్తులను కార్యదర్శి, విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ, జిల్లా కోర్టు ఆవరణ, విశాఖపట్నం-2, చిరునామాకు ఈనెల 31వ తేదీలోపు పంపించాలి.

న్యూస్‌రీల్

కొండా రాజీవ్‌గాంధీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కొండా రాజీవ్‌గాంధీ

జగదాంబ : విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కొండా రాజీవ్ గాంధీ శుక్రవారం సంస్థ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ సీఎం ఇచ్చిన బాధ్యతను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటరావు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరం

జిల్లా జడ్జి ఎం.శేషమ్మ



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శేషమ్మ

మహారాణిపేట : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా జడ్జి ఎం.శేషమ్మ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఐసీడీఎస్ పీడీ సమావేశ మందిరంలో ప్రైవేటు నర్సింగ్ హోమ్ స్కానింగ్ సెంటర్లు, గవర్నమెంటు యూపీహెచ్‌సీ/పీహెచ్‌సీ వైద్యులకు లింగ నిర్ధారణ చట్టంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో పరీక్షలు చేయడమే కాని ఫలితాలు చెప్పకూదన్నారు. ఈ కార్యక్రమం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జీవన్‌రాణి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మురళీమోహన్, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, డీపీవో శ్రీనివాసరావు, డీఎస్పీ డి.కాంతరావు, ఎస్ఐ ఎల్.వి.రమణ, ఎన్‌జీవో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత ఉపాధి శిక్షణకు పోర్టు సాయం

సాక్షి, విశాఖపట్నం : యువతను ప్రోత్సహించడంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందని వీపీఏ చైర్మన్ డా.అంగముత్తు తెలిపారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజన దినోత్సవాన్ని పోర్టులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.64.38 లక్షల చెక్కును సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారీటైమ్ అండ్ షిప్‌బిల్డింగ్(సెమ్స్) అధికారులకు అందజేశారు. ఈ నిధులతో కొరియర్ సూపర్ వైజర్ ఆపరేషన్స్, వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్, వేర్ హౌస్ పికర్, ఇన్వెంటరీ కంట్రోలర్ , సీఎన్‌సి ఆపరేటర్, వెర్టికల్ మెషీనింగ్ సెంటర్, ఎంఎంఏడబ్ల్యూ, స్వామ్ వెల్డర్, అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్ తదితర కోర్సులలో నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు వినియోగిస్తామని సెమ్స్ అధికారులు తెలిపారు. శిక్షణా కాలం మూడు నెలల పాటు ఉంటుందని పోర్టు చైర్మన్ తెలిపారు. సెమ్స్‌తో కలిసి విశాఖపట్నం పోర్టు అథారిటీ నిర్వహిస్తున్న ఈ ఉచిత శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలని పోర్టు చైర్మన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, ఎఫ్ఏ అండ్ సీఏఓ శరగడం శివకుమార్ , సెమ్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సెమ్స్ ప్రతినిధులకు చెక్ అందిస్తున్న పోర్టు చైర్మన్ డా.అంగముత్తు

వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకం



ద్రోణంరాజు శ్రీ వాత్సవ్



పేడాడ రమణి కుమారి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర యువజన విభాగ కమిటీని నియమించారు. ఇప్పటికే విశాఖ జిల్లాకు చెందిన కొండా రాజీవ్‌గాంధీ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయనతో పాటు విశాఖకు చెందిన ద్రోణంరాజు శ్రీవాత్సవ్‌ను మరో ఉపాధ్యక్షుడిగా నియమించారు. వీరితో పాటుగా పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కాండ్రేగుల యశ్వంత్(అనకాపల్లి), కార్యదర్శులుగా పలకా రవి (అనకాపల్లి), జగ్గుపల్లి నరేష్ (విశాఖ), సంయుక్త కార్యదర్శిగా భీశెట్టి జగన్(అనకాపల్లి), రంబుక్త ప్రభాకర్ నాయుడు(విశాఖ)లను నియమించారు. ఈమేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కమిటీ..

విశాఖ జిల్లాకు చెందిన మంతెన మాధవి వర్మ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. ఆమెతో పాటు విశాఖకు చెందిన పేడాడ రమణి కుమారిని మరో ఉపాధ్యక్షురాలిగా నియమించారు. వీరితో పాటుగా పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీదేవి అలియాస్ శిరీషను నియమించారు. ఈమేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

హైవేపై ఘోరం

- బైక్‌ను ఢీకొన్న లారీ
- చక్రాల మధ్య ఇరుక్కుపోయి ఇద్దరు దుర్మరణం
- విశాఖ వ్యాలీ కూడలి వద్ద మలుపు తిరుగుతుండగా ఘటన



లారీ వెనుక టైర్ల మధ్యలో లోకనాథం, మీనా మృతదేహాలు



మీనా(ఫైల్)



లోకనాథం(ఫైల్)

ఆరిలోవ: జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఇద్దరు లారీ టైర్ల మధ్య ఇరుక్కుపోయి ప్రాణాలు కోల్పోవడం స్థానికులను కలచివేసింది. ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం మత్రిపాడుకు చెందిన జన్ని లోకనాథం(25) చినగదిలి దరి హెల్త్‌సిటీలో జరుగుతున్న ఓ భవన నిర్మాణంలో తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. అక్కడే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్‌లో ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన అతని బంధువు కూర్మనాథపురం మీనా(30) అక్కడి మరో రేకుల షెడ్‌లో ఉంటోంది. ఆమె సాగర్‌నగర్ దరి గుడ్లవానిపాలెంలోని ఓ హోటల్‌లో పని చేస్తోంది. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో లోకనాథం బైక్‌పై ఆమెను హోటల్ వద్ద దించేందుకు వెళ్తున్నాడు. జాతీయ రహదారిపై విశాఖ వేలీ స్కూల్ కూడలి వద్ద సాగర్‌నగర్ వైపు మలుపు తిరుగుతుండగా.. వెనుకనే వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ సంఘటనలో కింద పడిన లోకనాథం, మీనాలిద్దరూ లారీ వెనుక చక్రాల మధ్యలో ఇరుక్కుపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. దీంతో అటుగా వెళ్లిన వారికి ఈ సంఘటన కంటతడి పెట్టించింది. కాగా.. ఈ లారీ ముడి ఇనుము లోడుతో నగరం నుంచి సాలూరు వెళుతోంది. ఈ ప్రమాదం కూడలిలో జరగడంతో.. నగరం నుంచి మధురవాడ వైపు వెళ్లే వాహనాలు డెయిరీఫాం వరకు వరకు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఆరిలోవ ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని క్రమబద్ధీకరించారు. సీఐ ద్వారా సమాచారం తెలుసుకున్న ఏడీసీపీ ట్రాఫిక్ శ్రీనివాసరావు సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. లోకనాథం అవివాహితుడు. మీనాకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొన్నాళ్లుగా భర్తకు దూరంగా ఉంటూ హోటల్‌లో పనిచేస్తోంది. సంక్రాంతికి శనివారం ఇద్దరు సొంతూరు వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంతలో ఈ ఘోరం జరిగిందని సహచరులు కంటతడి పెట్టారు. ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- మధురవాడలో టిడ్కో ఇళ్లు అందజేత
- చంద్రపాలెం పాఠశాల వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన



టిడ్కో ఇళ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు తదితరులు

మధురవాడ: దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 32 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. మధురవాడలో 240 కుటుంబాల సొంతింటి కలను నిజం చేశామని, ఆయా కుటుంబాలకు ముందే సంక్రాంతి పండగ వచ్చిందన్నారు. జీవీఎంసీ జోన్–2లోని సుద్దగెడ్డ వద్ద రూ.18.90కోట్లతో నిర్మించిన టిడ్కో ఇళ్లను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులతో కలసి శుక్రవారం లబ్ధిదారులకు అప్పగించారు. చంద్రంపాలెం ఉన్నత పాఠశాల వద్ద హైవేపై ప్రకాష్ యాడ్స్ సీఎస్సార్ నిధులు రూ.2.50 కోట్లతో నిర్మించే ఫుట్ ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుద్దగెడ్డ, చంద్రపాలెం ఉన్నత పాఠశాలల్లో జరిగిన బహిరంగ సభల్లో సుబ్బారెడ్డి మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 48 లక్షల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, ఇళ్లు కట్టించారని చెప్పారు. ఆయన కుమారుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 32 లక్షల మందికి ఇళ్ల పట్టాలు అందజేశారన్నారు. టిడ్కో ఇళ్లను నామమాత్రపు ధరకే ఇవ్వడంతో పాటు అక్కచెల్లెమ్మల పేరిట రిజిస్ట్రేషన్ కూడా చేయించామన్నారు. చంద్రంపాలెం హైస్కూల్ వద్ద రూ.2.5 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించి.. రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు వచ్చి మాయమాటలు చెబుతారని, అవి నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి మాట్లాడుతూ నియోజకవర్గంలో 30 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చే అవకాశం తనకు దక్కిందన్నారు. సినిమా డైలాగులు చెప్పే వారికంటే.. చెప్పింది చేసి చూపించే రియల్ హీరో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జెడ్పీ కనకమహాలక్ష్మి, డిప్యూటీ డీఈవో గౌరీశంకర్, కార్పొరేటర్లు ముత్తంశెట్టి ప్రియాంక, లొడగల అప్పారావు, వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, బొట్ట అప్పలరాజు, జీసీఎస్ కన్వీనర్ గాదే రోశిరెడ్డి, కుడితి రామారావు, పోతిన హనుమంతురావు, గుడ్ల పోలిరెడ్డి, లొడగల రామ్మోహన్, యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి నందేశ్, కల్చరల్ విభాగం కో–ఆర్డినేటర్ వంకాయల మారుతీప్రసాద్, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నాయకులు చెన్నాదాసు, అల్లాడ వెంకటరావు, పిళ్లా సూరిబాబు, పీకేఎం పాత్రుడు, రాజేశ్వరి, అప్పన్న, సియాద్రి కనకరాజు, బాబ్జీ, రజని, రామిరెడ్డి, నియోజకవర్గ రజక సంఘం అధ్యక్షుడు ఎస్.చంటి, హైస్కూల్ హెచ్‌ఎం రాజబాబు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బుడుమూరి మీనా, ప్రకాష్ యాడ్స్ స్టేట్ హెడ్ ఎ. మల్లికార్జున, వైజాగ్ మేనేజర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

రెవెన్యూ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, డీఆర్వో మోహన్‌కుమార్

మహారాణిపేట: రెవెన్యూ డైరీ–2024ను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున శుక్రవారం ఆవిష్కరించారు. ప్రభుత్వ సెలవులు, ప్రముఖ దినాలు, పరిపాలనాపరమైన ప్రాధాన్య అంశాలతో ఈ డైరీని ముద్రించారు. జేసీ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవో డి.హూస్సేన్ సాహెబ్, ఏవో కె.ఈశ్వరరావు తదితరులతో కలసి ఆయన డైరీని ఆవిష్కరించి.. వివిధ విభాగాల అధికారులు, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల పర్యవేక్షకులకు అందజేశారు.

లోగుట్టు పెరుమాళ్లకెరుక!

జీవీఎంసీ మెకానికల్‌లో మాయాజాలం

- కాంట్రాక్ట్ కంపెనీ ఉద్యోగి ఖాతాలోకి రూ.27.51 లక్షలు జమ
- ఆ ఖాతా నుంచే జీవీఎంసీ వాహనాల పన్నుల చెల్లింపు
- ఈ వ్యవహారంలో చక్రం తిప్పిన ఈఈ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ మెకానికల్ విభాగానికి చెందిన ఓ కాంట్రాక్ట్ కంపెనీ ఉద్యోగి ఖాతాలో ఏకంగా రూ.27.51 లక్షల మేర నగదును డిపాజిట్ చేయడం, అక్కడి నుంచి జీవీఎంసీ వాహనాలకు చెందిన రోడ్ ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్, సెస్ తదితర మొత్తాలను చెల్లించడం విమర్శలకు తావిస్తోంది. గతంలో జీవీఎంసీలో ఈఈగా పని చేసిన సుబ్బారావు.. జీవీఎంసీకి చెందిన కాంపాక్టర్లు, హుక్ లోడర్లు, పెద్ద స్వీపింగ్ యంత్రాలు తదితర వాహనాలకు 2023–24 ఆర్థిక సంవత్సరం పన్నులను చెల్లించేందుకు రూ.27.51 లక్షల మేర ఫలానా ఖాతాలో జమ చేయాలని సూచించారు. ఇందుకు అనుగుణంగా జీవీఎంసీ చెల్లింపుల విభాగం నుంచి సదరు కాంట్రాక్ట్ కంపెనీలో పనిచేసే ఉద్యోగి తులసీదాస్ బ్యాంకు అకౌంట్‌కు ఈ మొత్తం జమ అయ్యాయి. 2023 మార్చి 31లో మూడు విడతలుగా రూ.27.51 లక్షల మొత్తాన్ని జమ చేశారు. అదే ఉద్యోగి ఖాతా నుంచి జీవీఎంసీ వాహనాల పన్నులను అధికారులు చెల్లించారు. జీవీఎంసీ నిధులను ఈ విధంగా ఓ కాంట్రాక్ట్ కంపెనీ ఉద్యోగి బ్యాంకు ఖాతాలోకి మళ్లించిన వైనం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి జీవీఎంసీ వాహనాలకు ఇన్స్యూరెన్స్ మొత్తాన్ని చెల్లించేందుకు ఏదైనా వెండర్‌ను ఎంపిక చేసేందుకు టెండర్లను ఆహ్వానిస్తుంది. ఎవరైతే తక్కువ కమీషన్ తీసుకుని టెండర్లను దాఖలు చేస్తే.. ఆ సంస్థను ఎంపిక చేయడం జరుగుతుంది. అయితే.. ఇందుకు భిన్నంగా కాంట్రాక్ట్ కంపెనీలో ఉద్యోగి ఖాతాలో పెద్ద మొత్తంలో నిధులు జమ కావడం విమర్శలకు తావిస్తోంది. ఒకవేళ ఆ ఉద్యోగి ఈ మొత్తాన్ని తీసుకుని వెళ్లిపోతే ఎవరు బాధ్యత వహించే వారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంతేకాకుండా మెకానికల్ విభాగంలో గతంలో పని చేసి ప్రస్తుతం సెలవులో ఉన్న ఈఈ హయాంలో స్క్రాప్ విక్రయంతో పాటు వివిధ పనుల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ జరిగితే అసలు లోగుట్టు బయటకు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయం పలువురి నుంచి వ్యక్తమవుతోంది.

17న తిరుమల విద్యాసంస్థల్లో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం, విశాఖపట్నంలోని తిరుమల విద్యా సంస్థల్లో ఐదు నుంచి 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సు జరుగుతుందని ఆ సంస్థ చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ సదస్సుకు హాజరుకావాలనుకునే తల్లిదండ్రులు, విద్యార్థులు రాజమహేంద్రవరం క్యాంపస్ కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.తిరుమల ఈడీయూ.కామ్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విశాఖ క్యాంపస్‌లో జరిగే సదస్సుకు హాజరు కావాలనుకొనేవారు అదే తేదీన నేరుగా క్యాంపస్‌లో సంప్రదించవచ్చన్నా రు. 2023లో ఐఐటీ/ఎన్ఐటీ/ఐఐఐటీ/బిట్స్‌లలో 646 మంది విద్యార్థులు సీట్లు సాధించారని, ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన 233 మందిలో 14 మంది ఎయిమ్స్‌లో సీట్లు సాధించారన్నారు.

అటల్ సేతు నిర్మాణంలో విశాఖ ఉక్కు

ఉక్కునగరం: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అటల్ సేతు బ్రిడ్జి నిర్మాణంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తులను వినియోగించారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ గౌరవార్థం ముంబయిలోని సెవ్రీ నుంచి రాయగఢ్ జిల్లాలోని నవా శేవాను కలుపుతూ రూ.21,200 కోట్ల వ్యయంతో ఈ వంతెనను నిర్మించారు. ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో జరిగిన బ్రిడ్జి నిర్మాణ పనుల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 11,600 టన్నుల ఎఫ్ఈ 500డీ టీఎంటీ రీబార్ స్టీల్‌ను వినియోగించడం విశేషం. ప్రధాని మోదీ శుక్రవారం ఈ వంతెనను ప్రారంభించారు.

ఏసీబీ కోర్టు న్యాయమూర్తి బదిలీ

విశాఖ లీగల్: నగరంలోని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ బదిలీ అయ్యారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఆళ్లగడ్డ 5వ అదనపు న్యాయమూర్తిగా బదిలీ కాగా.. ప్రస్తుతం జిల్లా సీబీఐ కోర్టు న్యాయమూర్తి ఏసీబీ కోర్టుకు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

బీచ్‌రోడ్డు: తనతో పాటు చదువుకున్న స్నేహితులందరూ మంచి ఉద్యోగులు సాధించి జీవితంలో స్థిరపడ్డారని.. తాను మాత్రం ఇంకా సెటిల్ అవ్వలేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివీ.. హైదరాబాద్‌కు చెందిన కరణ్‌రాజ్ పురోహిత్ (23) విజయనగరంలో ఓ జాబ్ ఇంటర్వ్యూ కోసం చిన్నవాల్తేరులో ఉంటున్న తన స్నేహితుడి ఇంటికి వచ్చాడు. తనతో చదువుకున్న వారంతా ఉద్యోగులు చేస్తుండటం, తను మాత్రమే ఇంకా ఇంటర్వ్యూలకు వెళ్తుండటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. స్నేహితుడి కుటుంబం ఉంటున్న అపార్టుమెంట్ ఐదో అంతస్తు ఎక్కి కిందకు దూకేశాడు. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. యువకుడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. సాయంత్రానికి ఆయన తండ్రి నగరానికి చేరుకున్నారు. ఇంటి వద్ద కూడా చచ్చిపోతా అనే వాడని పోలీసులకు తెలిపారు.